అన్నదాతకు దన్ను

నాడు: వ్యవసాయం దండగ.. కరెంట్ తీగలపై బట్టలు ఆరబెట్టుకోండి. ఇవి అన్నదాతలను కించ పరుస్తూ నాటి ముఖ్యమంత్రి, నేటి టీడీపీ అధినేత చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు.

నేడు : ప్రజా సంకల్పయాత్ర ద్వారా రైతుల కష్టాలు కళ్లారా చూసిన జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వస్తే అండగా నిలుస్తానని మాట ఇచ్చారు. ఆ ప్రకారం రైతు భరోసాతో ఆదుకున్నారు. గ్రామాల్లోనే రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి దన్నుగా నిలిచారు. ఉచిత పంటల బీమా పెట్టి రైతులకు భరోసా కల్పించారు. ఫలితంగా సాగు సస్యశ్యామలంగా మారింది.



రైతు భరోసా కేంద్రం ద్వారా విత్తనాలు అందిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్ (ఫైల్)



పెందుర్తి: అన్నం పెట్టే రైతన్నకు ప్రభుత్వం అడుగడుగునా అండగా నిలుస్తోంది. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేశారు. వీటి ద్వారా రైతులకు సబ్సిడీపై విత్తనాలు అందిస్తున్నారు. వ్యవసాయ పనిముట్లు, ఇతర పరికరాలను రైతు సేవా కేంద్రాల ద్వారా సబ్సిడీపై పంపిణీ చేస్తున్నారు. దుక్కు నుంచి నూర్పు వరకు ప్రతీ దశలోనూ ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలవడంతో పెట్టుబడి కోసం ఇబ్బందులు పడకుండా సాగు చేస్తున్నారు.

సేవలన్నీ రైతు చెంతకే..

సీజన్‌లో పంట వేసేందుకు పెట్టుబడి సాయం మొదలుకుని పంట చేతికందిన తర్వాత గిట్టుబాటు ధర అందించే వరకు అన్నదాతకు వెన్నంటి ప్రోత్సహిస్తుంది. వైఎస్సార్ రైతు భరోసా పథకంలో భాగంగా నియోజకవర్గంలోని సబ్బవరం, పరవాడ, పెందుర్తి మండలాల నుంచి నాలుగు విడతలకు గాను 22570 మంది రైతులకు దాదాపు రూ. 90 కోట్ల పైగా వారి ఖాతాల్లోనే జమ చేసింది. సబ్బవరం మండలం అమృతపురంలో పైలట్ ప్రాజెక్ట్‌గా రైతు సేవా కేంద్రం ఏర్పాటు చేసి వారికి కావాల్సిన పనిముట్లు అందిస్తుంది. రైతులందరికీ వడ్డీ లేని రుణాలు అందిస్తున్నారు. పంట బీమా ప్రీమియం మొత్తం ప్రభుత్వమే చెల్లిస్తుంది. వ్యవసాయ ట్రాక్టర్లకు రోడ్డు ట్యాక్స్ రద్దు చేసింది. వ్యవసాయానికి పగటిపూట 9 ఉచితంగా విద్యుత్ ఇస్తోంది.



యంత్రసేవా కేంద్రం ద్వారా రైతులకు సబ్సిడీపై పంపిణీ చేస్తున్న యంత్రాలు

పెందుర్తి మండలం వాలిమెరక రైతు భరోసా కేంద్రం



- రైతు భరోసా కేంద్రాల ఏర్పాటుతో చేరువైన సేవలు
- గ్రామాల్లోనే ఎరువులు, విత్తనాలు
- రైతులకు తప్పిన పాట్లు
- రైతు భరోసా కింద రూ. 90 కోట్ల సాయం
- హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్న అన్నదాతలు

అను'బంధం'

నియోజవకర్గంలో మొత్తం 38(పెందుర్తి 9, పరవాడ 12, సబ్బవరం 17) రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు సేవలందిస్తున్నారు. ఆయా కేంద్రాల నిర్మాణానికి ప్రభుత్వం ఒక్కో భవనానికి సుమారు రూ.23.94 లక్షల(నియోజకవర్గం మొత్తం ఆర్‌బీకెలకు రూ.9.10 కోట్లు) చొప్పున నిధులు కేటాయించింది. వీటికి అదనంగా వ్యవసాయ అనుబంధ కమిటీలు/సంఘాలకు పునర్జీవం పోసింది. గత పదేళ్లుగా పూర్తిగా నిర్వీర్యం అయిన పీఏసీఎస్‌లకు జీవం పోసింది. వ్యవసాయ మార్కెట్ కమిటీలను ఏర్పాటు చేసింది. ఆయా సంఘాల ద్వారా రైతులకు అవసరమైన సేవలు అందించేందుకు కార్యాచరణ రూపొందించి అమలు చేస్తోంది.

రైతులకు ఎనలేని మేలు



ఒకప్పటిలా వ్యవసాయం అంత సులభం కాదు. ప్రతీ అడుగులోనూ ఎంతోకొంత పెట్టుబడి పెట్టాలి. ఏటా తొలకరి, ఖరీఫ్ నాటికి సగటున రూ.10 నుంచి 15 వేలు అవసరం అవుతాయి. గతంలో అయితే ఖరీఫ్ సీజన్‌కు ముందు చేతిలో చిల్లిగవ్వ ఉండని పరిస్థితి. కానీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత పెట్టుబడి సాయం అందిస్తున్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు ఎనలేని మేలు జరుగుతుంది.
– గంగ్రెడ్డి రమణ, రైతు, వాలిమెరక జుత్తాడ.

గ్రామంలోనే విత్తనాలు, ఎరువులు



2004లో డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రుణమాఫీ రూపంలో చాలా వరకు లబ్ధి పొందాం. ఆయన తనయుడు వైఎస్ జగన్ ముఖ్యమంత్రి కాగానే పెట్టుబడి సాయం కింద నాలుగేళ్లుగా ఫలం పొందుతున్నాం. రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి అన్నివిధాల రైతులను ఆదుకుంటున్నారు. గతంలో ఎరువులు, విత్తనాల కోసం మండల కార్యాలయం చుట్టూ తిరిగేవాళ్లం. ఇప్పుడు ఆ కష్టాలు తొలగిపోయాయి.
– గురి అర్జున, రైతు, మొగలిపురం.

రైతులతో మమేకం అవుతున్నాం



రైతులకు ప్రభుత్వం నుంచి అన్ని వైపులా సహకారం అందుతోంది. రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేయడం వల్ల రైతులకు సమయానికి విత్తనాలతో పాటు సాగు సలహాలు అందుతున్నాయి. అదే సమయంలో పథకాలు వారికి మరింత చేయూతనిస్తున్నాయి. మేం కూడా రైతులకు అందుబాటులో ఉంటూ సేద్యంలో కొత్త తరహా పద్ధతులపై అవగాహన కల్పిస్తున్నాం.
– ఎ.దుర్గాప్రసాద్, మండల వ్యవసాయాధికారి, పెందుర్తి.

సింహగిరిపై ఘనంగా చిలుకు ద్వాదశి ఉత్సవం



చిమ్మిడిని దంచుతున్న అర్చకులు, పాల్గొన్న ఈవో దంపతులు, ట్రస్ట్‌బోర్డు సభ్యులు

సింహాచలం: సింహగిరిపై శుక్రవారం చిలుకు ద్వాదశి ఉత్సవం విశేషంగా జరిగింది. అనకాపల్లికి చెందిన గవరలు(ఆడారి నూకయ్య వంశీయులు) తరలివచ్చి ఈ ఉత్సవాన్ని శ్రీ వరాహలక్ష్మీనృసింహస్వామికి జరిపించారు. ఏటా కార్తీక ద్వాదశి రోజున ఆలయంలో చిలుకు ద్వాదశి ఉత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ ఉత్సవంలో పాలు పంచుకునే అవకాశాన్ని తరతరాలుగా అనకాపల్లిలోని గవర సామాజికవర్గానికి చెందిన ఆడారి నూకయ్య కుటుంబీకులుకు దేవస్థానం కల్పిస్తోంది. దీనిలో భాగంగా శుక్రవారం ఆడారి నూకయ్య కుటుంబీకులు పూజా ద్రవ్యాలు తీసుకొచ్చారు. సాయంత్రం ఆలయ ఆస్థాన మండపంలో ఉత్సవాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలకు, శయన పెరుమాళ్లు, ఆళ్వారులను మండపంలో అధిష్టింపజేశారు. స్వామిచెంతన నువ్వులు, బెల్లం, పాలు రోట్లో వేసి చెరకు గెడలతో శాస్త్రోక్తంగా దంచారు. తయారైన చిమ్మిడిని స్వామికి నైవేద్యంగా ఆరగింపు చేశారు. తదుపరి శయన పెరుమాళ్లకు బేడా తిరువీధి నిర్వహించారు. భక్తులకు ప్రసాదం అందజేశారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు తదితరులు ఉత్సవాన్ని నిర్వహించారు. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి దంపతులు, ట్రస్ట్‌బోర్డు సభ్యులు గంట్ల శ్రీనుబాబు, వారణాసి దినేష్‌రాజ్ పాల్గొన్నారు.

విశేషంగా నృత్యప్రదర్శన

సింహాచలం: సింహగిరిపై శుక్రవారం జరిగిన నృత్యప్రదర్శన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి రాజగోపురం పక్కన ఉన్న కళావేదికపై సుమారు 30 మంది నృత్య కళాకారులు నృత్యప్రదర్శనలు చేశారు. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

క్లుప్తంగా

తూర్పుకాపులు ఐక్యంగా ఉండాలి



తూర్పు కాపు సంఘం జిల్లా అధ్యక్షుడు రమణయ్యను సన్మానిస్తున్న సంఘ పెద్దలు

పెందుర్తి: హక్కుల సాధనకు తూర్పు కాపులంతా ఐక్యంగా ఉండాలని తూర్పు కాపు సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎ.వి. రమణయ్య అన్నారు. శుక్రవారం వేపగుంటలోని శ్రీకృష్ణ దేవరాయ కాపు కల్యాణ మండపంలో తూర్పు కాపు సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రమణయ్య మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహిస్తున్న కుల గణన సమయంలో అందరూ తూర్పు కాపులుగా నమోదు చేసుకోవాలని సూచించారు. పలు కీలక అంశాలపై చర్చించారు. కార్పొరేటర్ ముమ్మన దేముడు, తూర్పు కాపు సంఘం ప్రతినిధుల రమణయ్యను ఘనంగా సత్కరించారు. తూర్పుకాపు సంఘం గౌరవ అధ్యక్షుడు బొండా అప్పారావు, సంఘం ప్రతినిధులు మురిపిండి సన్యాసిరావు, గంగ్రెడ్డి మహాలక్ష్మినాయుడు, సేనాపతి శేఖర్, గంగ్రెడ్డి రామునాయుడు, ఇల్లపు శ్రీను, బొడ్డు సూర్యప్రకాష్, ముమ్మన కొండబాబు, ఆకుల అప్పారావు, విరోతి దేవుడు, పన్నింటి పార్వతి, గంట్ల దివాకర్, మధుపాడ అంజి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పరవాడ: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని దేశపాత్రునిపాలెం ఫీడర్‌లో నిర్వహణ పనులు చేపట్టనున్న దృష్ట్యా శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఏఈ శేషసాయి ఒక ప్రకటనలో తెలిపారు. ఫలితంగా దేశపాత్రునిపాలెం, జాజులవానిపాలెం, పోర్టుకో, గొర్లివానిపాలెం గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండబోదని ఏఈ శేషసాయి చెప్పారు. వినియోగదారులు గమనించాలని కోరారు.

అనంత పద్మనాభస్వామి దీపోత్సవానికి రూ.8 లక్షలు

సింహాచలం దేవస్థానం నుంచి కేటాయింపు

సింహాచలం: పద్మనాభంలోని అనంతపద్మనాభస్వామి దేవస్థానంలో వచ్చేనెలలో జరిగే దీపోత్సవం నిర్వహణకు భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు చొరవతో సింహాచలం దేవస్థానం రూ. 8 లక్షలు కేటాయించింది. దీపోత్సవం నిర్వహణకు నిధులు కేటాయించాలని సింహాచలం దేవస్థానం అధికారులకు ఇటీవల ముత్తంశెట్టి విజ్ఞప్తి చేశారు. దీంతో అనంతపద్మనాభస్వామి దేవస్థానం ఈవో దేవదాయశాఖ డిప్యూటీ కమిషనర్ ద్వారా సింహాచలం దేవస్థానం ఈవోకు ప్రతిపాదనలు పంపారు. ఈ మేరకు సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్‌కు ఆ ప్రతిపాదనని పంపారు. ఆ ప్రతిపాదనకు కమిషనర్ ఆమోద ముద్ర వేశారు.

భారీ అన్నసమారాధన

పెందుర్తి: జీవీఎంసీ 95వ వార్డు చీమలాపల్లిలో గౌరీ పరమేశ్వరుల ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం భారీ అన్న సమారాధన నిర్వహించారు. కార్పొరేటర్ ముమ్మన దేముడు చేతుల మీదుగా సంతర్పణ ప్రారంభించారు. దాదాపు 2 వేల మంది అన్నప్రసాదాలు స్వీకరించారు. ముందుగా గౌరమ్మకు ప్రత్యేక పూజలు జరిపారు. ఏఎంసీ డైరెక్టర్ అయిత ఎర్రయ్య, నాయకులు చిప్పల చందు, కంచిబోయిన సంతోష్, దువ్వి అప్పారావు, బొట్ట రాము, బొడ్డు దేముడుబాబు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సాధికార బస్సు యాత్రకు తరలిరండి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు

పరవాడ: ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఆధ్వర్యంలో సబ్బవరంలో శనివారం భారీ ఎత్తున నిర్వహించనున్న సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేయాలని ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మిశ్రీనివాసరావు, జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు, మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు కోరారు. పరవాడలో శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు. జగనన్న అందిస్తున్న విద్య, వైద్యం, ఆరోగ్యం, అభివృద్ధి వంటి సంక్షేమ పథకాలు పార్టీ నేతలు బస్సు యాత్రలో ప్రజలకు వివరిస్తారన్నారు. బస్సు యాత్రకు మండలంలో పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, వలంటీర్లు, వార్డు సభ్యులు, గృహ సారథులు, ప్రజలు శనివారం మధ్యాహ్నం 1 గంటకు నిర్దేశించిన బస్సుల్లో మధ్యాహ్నం 2.30 గంటలకు సబ్బవరం ప్రధాన కూడలికి చేరుకొని బస్సుయాత్రను జయప్రదం చేయాలని ఎంపీపీ వెంకటపద్మలక్ష్మి శ్రీనివాసరావు కోరారు.

బహిరంగ సభకు చురుగ్గా ఏర్పాట్లు

సబ్బవరం: సబ్బవరంలో సామాజిక సాధికార బస్సుయాత్రలో భాగంగా శనివారం నిర్వహించనున్న బహిరంగ సభకు చురుగ్గా ఏర్పాట్లు పూర్తయ్యాయి. సబ్బవరంలోని చోడవరం–సబ్బవరం రోడ్డులోని దుర్గాలమ్మ ఆలయం సమీపంలో ఈ బహిరంగ సభ ఏర్పాటు చేయనుండటంతో బహిరంగ సభ ప్రాంగణంలో భారీగా ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు దర్శనమిస్తున్నాయి. మధ్యాహ్నం 3 గంటల సమయంలో బహిరంగ సభ ఉండడంతో పార్టీ మండల కన్వీనర్ కర్రిబాబు,పార్టీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పాలిశెట్టి సురేష్ రాజ్, పార్టీ సీనియర్ నాయకుడు సబ్బవరపు నారాయణమూర్తితో పాటు మిగిలిన పార్టీ శ్రేణులంతా ఏర్పాట్లలో తలమునకలై ఉన్నారు.ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా వాహనాలు పార్కింగ్, సభ ఏర్పాట్లు, పోలీస్ బందోబస్తు వంటి వాటిపై సీఐ రంగనాథం పర్యవేక్షిస్తున్నారు.

పాలిటెక్నిక్ కళాశాలకు మహర్దశ

- రూ. 8 కోట్లతో వసతుల కల్పన
- ఆధునిక హంగులతో పెందుర్తి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల
- నేడు నూతన భవనం ప్రారంభోత్సవం



ప్రారంభోత్సవానికి సిద్ధంగా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల నూతన భవనం

పెందుర్తి: పెందుర్తిలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు మహర్దశ పట్టింది. ప్రస్తుతం ఉన్న ప్రధాన భవనానికి అదనంగా సాంకేతిక విద్యాశాఖ మంజూరు చేసిన రూ.8 కోట్లతో అదనపు భవనం సిద్ధమైంది. శనివారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు సహా పలువురు మంత్రులు ఈ భవనాన్ని ప్రారంభించనున్నారు.


అరుదైన అవకాశం..స్కిల్ హబ్

పెందుర్తి పాలిటెక్నిక్ కళాశాలను 22 గదులతో 2018లో ప్రారంభించారు. సివిల్, మెకానికల్, ఈఈఈ, ఈసీఈ బ్రాంచ్‌లు ఉండగా ఒక్కో బ్రాంచ్‌కు 60 సీట్లు కేటాయించారు. అదనంగా బ్రాంచ్‌కు మరో 6 సీట్లు అందుబాటులో ఉన్నాయి. అయితే 2020–21 విద్యా సంవత్సరం నుంచి కళాశాల దశ తిరిగింది. ప్రభుత్వం సాంకేతిక విద్యపై శ్రద్ధ పెట్టడంతో గతేడాది కళాశాలకు రూ.8 కోట్లు నిధులు వచ్చాయి. దీంతో ఇక్కడ 20 గదులతో అదనపు భవనం నిర్మాణం చేపట్టారు. ఇది శనివారం నుంచి అందుబాటులోకి రానుంది.

గంగవరం పోర్టు పెద్ద మనసు

కళాశాలలో మరిన్ని సౌకర్యాల కల్పనకు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.చంద్రశేఖర్ చొరవ తీసుకున్నారు. గంగవరం పోర్టు, స్టీల్‌ప్లాంట్, కోరమాండల్, ఎన్ఎస్‌టీఎల్ లాంటి సంస్థలను సంప్రదించారు. అందులో గంగవరం పోర్టు యాజమాన్యం రూ.37 లక్షలు కళాశాలకు సీఎస్ఆర్ నిధులు కేటాయించి పెద్ద మనసు చాటుకుంది. ఆయా నిధులతో విద్యార్థులకు ఉపయోగపడే విధంగా 200 స్టూళ్లు, డ్యూయెల్ డెస్క్ టేబుళ్లు తయారు చేయించారు. 40 కంప్యూటర్లు ఏర్పాటు చేసి అందులో ఆటోక్యాడ్ సాఫ్ట్‌వేర్ ఇన్‌స్టాల్ చేశారు.

సౌకర్యాలు కల్పించడమే లక్ష్యం



సాంకేతికరంగంలో రోజురోజుకు అవకాశాలు మెరగవుతున్నాయి. విద్యార్థుల్లో సృజనాత్మక పెంచేందుకు అవసరమైన సౌకర్యాలు కల్పనపై ప్రభుత్వం దృష్టిసారించింది.అదనపు భవనం నిర్మాణం వల్ల మరిన్ని సౌకర్యాలు కల్పించే అవకాశం వచ్చింది.
– డాక్టర్ చంద్రశేఖర్, ప్రిన్సిపాల్.

మంగమ్మ సన్నిధిలో ప్రత్యేక పూజలు

పెందుర్తి: చినముషిడివాడ సమీపంలోని సప్తగిరినగర్ అలివేలు మంగమ్మ సన్నిధిలో కార్తీకక శుక్రవారం పురస్కష్కరించుకుని ప్రత్యేక పూజలు జరిగాయి. అమ్మవారికి అభిషేకాలు చేశారు. నక్షత్ర హారతి ఇచ్చారు. అమ్మవారి సన్నిధిలో మహిళలు వాయినాలు ఇచ్చి పుచ్చుకున్నారు. ఈ నెల 27న అమ్మవారికి పంచామృతాభిషేకాలు జరుగుతాయని ఆలయ ప్రధాన అర్చకుడు మణిబాబు తెలిపారు.

అప్పన్నను దర్శించుకున్న సినీ హాస్యనటులు



సింహగిరిపై సినీ హాస్యనటులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని శుక్రవారం సినీ హాస్యనటులు శ్రీలక్ష్మి,చిట్టిబాబు, జయలలిత దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. వారి పేరిట అర్చకులు స్వామికి పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు.

సాయిబాబాకు సింహాసనం బహూకరణ

పెందుర్తి: సుజాతనగర్‌లోని పూర్ణ పుష్కల సమేత ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి దేవాలయ ప్రాంగణంలోని షిర్డీ సాయిబాబా పాలరాతి విగ్రహానికి సూరిశెట్టి అప్పలనాయుడు, రూపాలక్ష్మి దంపతులు రూ.2 లక్షల నిధులతో ప్రత్యేక సింహాసనం, మరకతోరణం సమకూర్చారు. వీటిని బాబాకు శుక్రవారం సమర్పించారు.ఆలయ ధర్మకర్త చంద్రశేఖర్‌రెడ్డి, భక్తులు పూజల్లో పాల్గొన్నారు.